క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన కాణిపాక ఆలయ ఈఓ



చిత్తూరు కలెక్టరేట్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈఓ పెంచలకిషోర్ సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీని మర్యాదపూర్వకంగా కలిశారు. వరసిద్ధి వినాయకస్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల నుంచి కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఉచిత అన్నదానం, లడ్డు పంపిణీల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం కాణిపాకం ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఈఓ ఉన్నతాధికారులతో చర్చించారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన



బంగారుపాళెం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. శంకర్ నేత్రాలయ వైద్యులు 45 మంది వైద్య పరీక్షలు చేశారని తెలిపారు. 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. వారిని చెన్నైకి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయించి మందులు, కంటి అద్దాలు అందజేస్తామని వెల్లడించారు.

వరసిద్ధుని సన్నిధిలో ప్రముఖులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సోమవారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదరం, కడప ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ప్రసాదం, స్వామి వారి చిత్ర పటం అందజేశారు. ఈవో పెంచలకిషోర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు




మేఘనాథం, రాకేష్

బంగారుపాళెం: మండలంలోని కేజీ సత్రం వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. దీంతో పరదరామికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పరదరామి తాలూకా పూజారివలస ఎస్టీ కాలనీకి చెందిన రాకేష్, మేఘనాథం బంగారుపాళెం మండలం వెంకటాపురంలో మేస్త్రీ పని చేస్తున్నారు. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. కేజీ సత్రం వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా పలమనేరు నుంచి చిత్తూరు వెళుతున్న కారు ఢీకొంది. మేఘనాథం కాలు విరిగి పోయింది. రాకేష్ తలకు బలమైన గాయమైంది. వారిని స్థానికులు 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు ఆపకుండా వెళ్లిపోవడంతో టోల్ గేట్ వద్ద స్థానికుల సాయంతో పట్టుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు.

సారా స్వాధీనం



చిత్తూరు అర్బన్: చిత్తూరులో నాటు సారా కొనుగోలు చేసి.. తమిళనాడుకు తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ జవహర్ బాబు కథనం మేరకు.. గుడిపాల మండలం చీలాపల్లె వద్ద ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఓ ద్విచక్ర వాహనంపై రజని అనే వ్యక్తి సంచి తీసుకెళుతుండగా, దానిని పరిశీలించారు. అందులో 110 లీటర్ల సారా ప్యాకెట్లు లభించాయి. నిందితుడు తమిళనాడులోని వేలూరుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాలతో చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు. ఇదలా ఉంచితే, ఇతనికి సారా సరఫరా చేసిన గుడిపాలకు చెందిన జె.ప్రభు, చిత్తూరుకు చెందిన చిన్నయ్య అనే ఇద్దరు నిందితులపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మత్యంలో రెవెన్యూ సదస్సు

తవణంపల్లె: మండలంలోని మత్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మత్యం రెవెన్యూలోని రైతులు భూ సమస్యలపై అర్జీలు సమర్పిస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

శిల్పం చేసి.. ప్రాణం పోసి..!

ఉలి దెబ్బలకు శిల శిల్పమవుతుంది. చూపరులను ఆకట్టుకుంటుంది. ఇలా ఎక్కడో ఉన్న రాయి ఓ శిల్పి ఉలి దెబ్బలకు చరితార్థమవుతుంది. యాదమరికి చెందిన తండ్రీ కొడుకులు దేవాలయ శిల్పకళపై పట్టు కలిగి, తమ కళా కౌశలంతో శిలలను అద్భుత రూపాలుగా తీర్చిదిద్దుతున్నారు. వీరు తమ నైపుణ్యంతో సృజించిన శిల్పాలు జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లాయి.



మణివణ్ణన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఓ ఆలయ నిర్మాణ పనులు



కృపానంద స్థపతిని సన్మానిస్తున్న శిల్పకళాకారులు (ఫైల్)



శిల్పానికి మెషిన్‌తో తుదిమెరుగులు దిద్దుతున్న మణివణ్ణన్

- శిల్పకళలో రాణిస్తున్న తండ్రీకొడుకులు
- చేయి పడితే అద్భుతంగా శిలారూపం
- వేలాది ఆలయాలకు శిల్పాలు

కాణిపాకం: 42 ఏళ్లకు క్రితం తమిళనాడులోని తంజావూరుకు చెందిన శిల్పి దక్షిణమూర్తి యాదమరిలోని శ్రీవరదరాజులస్వామి రాజగోపురం నిర్మాణానికి వచ్చారు. ఆ సమయంలో యాదమరికి చెందిన కృపానంద స్థపతి ఆలయంలో జరిగే పనికి వెళ్లారు. అలా వెళ్లిన ఆయనకు శిల్పకళ నేర్చుకోవాలని పట్టు బట్టారు. 20 ఏళ్ల వయస్సులో దక్షిణమూర్తి వెంట తంజావూరుకు వెళ్లిపోయారు. 30 ఏళ్ల పాటు అక్కడ శిల్పకళ విద్య నేర్చుకున్నారు. ఆ తర్వాత గురువు సహకారంతో సొంత జిల్లాలోనే శిల్పకళను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 5వేల ఆలయాలకు తన శిల్పాలతో ప్రాణం పోశారు. సొంత గ్రామంలోనే 70 మంది శిల్పులను తయారు చేశారు. అలాగే తండ్రి నేర్పిన పాఠంతో తనయుడు మణివణ్ణన్ శిల్పుడిగా మారారు. ఇంటర్ విద్యను పూర్తి చేసుకుని నాలుగేళ్ల పాటు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర శిల్ప కళాశాలలో చేరారు. 2002లో ఈ శిక్షణను పూర్తి చేసి వృత్తిలో అడుగు పెట్టారు. ఈ 24 ఏళ్ల కాలంలో లెక్కలేనన్ని శిల్పాలు సృష్టించారు వంద ఆలయాలకు ప్రాణం పోస్తూ వస్తున్నారు. చిత్తూరు నగరం రెడ్డిగుంట ప్రాంతంలో శ్రీసాయి కృపా శిల్ప నిలయం ఏర్పాటు చేసుకున్నారు.

''కాగితంపై వేస్తున్న బొమ్మ. అనుకున్నట్లు రాకపోతే మరో కాగి తంపై వేయొచ్చు.. కానీ శిల్పం చెక్కేటప్పుడు అలా కుదరదు. ఒక శిల్పానికి కావాల్సిన రాయిని కొలతలు వేసి ఇస్తారు. దానికి అనుగుణంగా చెక్కుతాం... ఒక ముడి శిల నుంచి విగ్రహాన్ని తయారు చేయాలంటే దాన్ని పలు భాగాలుగా విభజించుకుంటాం. కొలతల ప్రకారం రాయిపై మార్కింగ్ చేసుకుంటాం.. అందుకు అనుగుణంగా సరిచేసు కుంటూ చివరికి శిల్పానికి అనుగుణంగా ఉండే దశకు తీసుకొస్తాం'' అంటున్నారు...మణివణ్ణన్. ఇక్కడ శిల్పులు ఇసుక, రాయి (శాండ్ స్టోన్), గ్రానైట్ రాయి వినియోగిస్తున్నారు. గ్రానైట్ రాయి కుప్పం, తమిళనాడులోని కంచి నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

రాయి ఎంపిక ఎంతో కీలకం

శిల్పాలు చెక్కేందుకు 20 ఏళ్ల కిందటి వరకు సుత్తి, ఉలి, సమ్మెట, ఇనుప బద్దెలు, గునపాలు వినియోగించే వారు. ఇటీవల కాలంలో యాంత్రీకరణను అందిపుచ్చుకున్నారు. గతంలో 10 అడుగుల శిల్పాన్ని తయారు చేసేందుకు ఆరు నెలల సమయం పడితే, నేడు రోజుల్లో వ్యవధిలోనే సిద్ధం చేస్తున్నారు. ఎంత యాంత్రిక సహకారం ఉన్నా శిల్పిలో సృజనాత్మకత లేకపోతే శిల్పంలో జీవకళ పోతుంది. అందుకే చివరి దశలో సుత్తి ఉలికి పని కల్పించి శిల్పంగా మార్చి మెషిన్‌తో తుది మెరుగులు దిద్దుతున్నారు.

పనిలో యాంత్రి'కరుణ'



భుక్తి కోసం చేసే ఏ పనైనా భక్తితో చేయాల్సిందే. దీనికి కులం మతంతో పని లేదు..ఆలయాలు నిర్మించే పని దొరకడం మా పూర్వజన్మ సుకృతం. జిల్లా వ్యాప్తంగా తిరుగుతున్నాం. చేతినిండా పని దొరుకుతోంది. శిల్పాల తయారీ కోసం ఆర్డర్లు వెతుక్కుని వస్తున్నాయి. మా నాన్న ప్రోత్సాహంతోనే ఈ వృత్తిలో రాణిస్తున్నా. నాతో పాటు 70 మందికి శిల్ప విద్య బోధించారు.

–మణివణ్ణన్, శిల్పకారుడు

మానవ హక్కుల పరిరక్షణకు పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మానవ హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు చేస్తామని భారత సమ సమాజ అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తలారి కృష్ణమూర్తి తెలిపారు. ఆయన సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లో సంఘాలను ఏర్పాటు చేసి నాయకత్వాన్ని బలపరుస్తామన్నారు. ప్రతినెలా సివిల్ రైట్స్ డే సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై ప్రజలకు తెలియజేసేలా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. యువతకు ఉపాధి, శిక్షణతో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా అవగాహన కల్పిస్తామన్నారు. చర్చ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల డిమాండ్లను పాలకుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మునస్వామి, ధనుంజయరావు, బాబు, రాజ్ కుమార్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ వినతులు పరిష్కరించండి

- మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వస్తున్న వినతులు, సమస్యల విషయంలో నిర్లక్ష్యం వ్యవహరించరాదని, త్వరితగతిన పరిష్కరించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ, పింఛన్, పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్‌కు సంబంధించి పలు ఫిర్యాదులు అందాయి. అనంతరం అధికారులతో కమిషనర్ సమీక్షించారు. గ్రీవెన్స్‌లో వస్తున్న సమస్యలను క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలపై ధర్నా



చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

చిత్తూరు అర్బన్: మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ సంఘ నాయకులు ఎస్. నాగరాజన్ మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. చిత్తూరులో కార్మికులకు సరెండర్ లీవు వేతనాలు, పింఛన్ సమస్యలు, ఏపీజీఎల్ఐసీ ఖాతాలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇక పెరిగిన నిత్యావసర ధరల నేపథ్యంలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు రూ.31 వేల వేతనం మంజూరు చేయాలన్నారు. కొంత మంది సచివాల కార్యదర్శులు, కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని.. వాటిని నియంత్రించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న యూనిఫాం, సబ్బులు, ఇతర ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు దొరస్వామి, జయశంకర్, విజయకుమార్, సురేష్, చంద్ర, వినాయక, సుగుణ, రమణి, రాణి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె..!

- కలెక్టరేట్‌కు వినతుల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్: వినతులు ఇస్తున్నాం...పరిష్కారం చూపండి సారూ అంటూ జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయరూ!



చాలా రోజులుగా వృద్ధాప్య పింఛన్ మంజూరు కోసం కాళ్లు అరిగేలా తిరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. నా వయస్సు 60 ఏళ్లు. కార్యాలయాల్లో చాలా సార్లు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని వినతులు ఇచ్చాను. ఇప్పటివరకూ న్యాయం చేయలేదు.

–శివప్రసాద్, కాజూరు, చిత్తూరు

భూమిని ఆక్రమించుకుంటున్నారు



అక్రమంగా భూమిని ఆక్రమించుకుంటున్నారు. పెనుమూరు మండలం పులికల్లు గ్రామ పరిధిలో సర్వే నంబర్ 306 లో 3.27 సెంట్ల భూమి అనుభవంలో ఉండేది. ఎన్నో ఏళ్లుగా ఆ భూమిలో పంటలు పండించుకుని జీవిస్తున్నాం. ప్రస్తుతం మా గ్రామంలోని కొందరు మా భూమిలోని మామిడి చెట్లను తొలగించి రోడ్లు వేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించినందుకు దాడి చేస్తున్నారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.

–రామమూర్తి రెడ్డి, పులికల్లు, పెనుమూరు మండలం

వితంతు పింఛన్ ఇప్పించాలి



వితంతు పింఛన్ ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చాను. మండల స్థాయిలో చాలా సార్లు అర్జీ ఇచ్చినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. అందుకే కలెక్టరేట్‌కు రావాల్సి వస్తోంది. నా భర్త మృతి చెంది చాలా రోజులైంది. అధికారులు స్పందించి వితంతు పింఛన్ మంజూరు చేసి న్యాయం చేయాలి.

–వనజ, నల్రాజుఊరు, యాదమరి మండలం

పట్టామార్పు చేయించండి



పట్టామార్పు కోసం అధికారులకు వినతిపత్రం ఇచ్చాను. నాభర్త మురుగన్ పేరుపైన 308 సర్వే నంబర్ 69/3 లో 0.40 సెంట్లు, 69/4 లో 1.16 సెంట్లు ఉంది. ఆ భూమి నా భర్త పేరు మీదే ఉంది. నా భర్త మరణించారు. ఆ భూమిని నా పేరిట మార్చుకోవడం కోసం చాలా సార్లు మండల కార్యాలయం చుట్టూ తిరిగినా న్యాయం చేయలేదు. కలెక్టర్ సారుకు సమస్య చెప్పుకునేందుకు వచ్చా

–వసంత, ఎల్‌బీ పురం, చిత్తూరు రూరల్

కాలువ పనులను పరిశీలించిన కమిషనర్



కార్పొరేటర్ హరిణితో కలిసి కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: చిత్తూరు 5వ డివిజన్ పరిధిలోని కాలువను మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఇటీవల కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ హరిణి మాట్లాడుతూ.. తన డివిజన్ ప్రాంతంలో కాలువ నిర్మాణం పనులను ప్రజలకు సౌకర్యంగా ఉండేలా చూడాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే జగన్ మోహన్ ఆదేశం మేరకు కమిషనర్ ఆ ప్రాంతాన్ని అధికార యంత్రాంగంతో కలిసి పోలీసు కాలనీలోని కాలువ నిర్మాణాన్ని కార్పొరేటర్ హరిణితో కలిసి పరిశీలించారు.

భానుప్రతాప్‌వి తప్పుడు ఆరోపణలు



శేఖర్‌బాబు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎస్ఆర్ పురం మండలం దుర్గరాజపురం క్వారీ వ్యవహారంలో తనపై భానుప్రతాప్ అనే వ్యక్తి చేసిన ఆరోపణలు నిరాధారమని గ్రానైట్ వ్యాపారి శేఖర్ బాబు స్పష్టం చేశారు. ఆయన సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ క్వారీ మణి నాయుడు పేరిట ఉండన్నారు. ఆయన మరణం తర్వాత కుటుంబ సభ్యులు తనకు విక్రయిస్తున్నట్లు జీపీఏ ఇచ్చారని తెలిపారు. చట్ట ప్రకారం జీపీఏ ద్వారా మైనింగ్ చేసేందుకు తనకు అనుమతులు వచ్చాయన్నారు. ఇప్పుడు ఆకస్మాత్తుగా తనపై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పత్రంలో కూడా రెండు రకాలుగా సంతకాలు ఉన్నాయన్నారు. వారి కుటుంబంలోని ఒక వ్యక్తిని తప్పించడానికి ఈ రకమైన ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

జెడ్పీ అతిథి గృహం పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం ఎదుట పాడుబడిన జెడ్పీ అతిథి గృహాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సోమవారం పరిశీలించారు. చాలా ఏళ్లుగా వినియోగంలో లేక శిథిలావస్థకు చేరిన జెడ్పీ అతిథి గృహాన్ని వినియోగంలోకి తెచ్చే అంశంపై అధికారులతో చర్చించారు. పాత భవనానికి మరమ్మతులు చేస్తే సరిపోతుందా? పూర్తిగా తొలగించి నూతన భవనం నిర్మించాలా? అని అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీఈలు ప్రసాద్‌నాయుడు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న వెంకటప్రసాద్

తవణంపల్లె: హైరిస్క్ గర్భిణులు రక్తపోటు రాకుండా జాగ్రత్తగా ఉండాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ సూచించారు. సోమవారం తవణంపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 27 మంది హైరిస్క్ గర్భిణులకు వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ ప్రత్యేకంగా పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమాన్ని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆరో నెల నుంచి తొమ్మిదో నెల వరకు గర్భిణులు జాగ్రత్తగా ఉండాలన్నారు. కౌమార బాలికల ఆరోగ్యం, రక్తహీనత, వ్యక్తిగత శుభ్రత, వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకత గురించి వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఎల్‌టీ శేఖర్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి



పల్లెచెరువులో మహిళలకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: పేదలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేకంగా పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో వ్యాధులు సోకకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. లార్వా దశలోనే దోమలను అరికట్టాలన్నారు. అదేవిధంగా మండలంలోని పల్లెచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ రోగులకు పరీక్షలు చేశారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేసి మందులు అందజేశారు. జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఐరాల: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులు రాకుండా చూడొచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పాలకల రెడ్డివారిపల్లె, కుమ్మరపల్లె గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో రెండు గ్రామాల్లో 85 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. పీహెచ్‌సీలో సోమవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా 40 మంది గర్భిణులకు బీపీ, షుగర్, గుండె, మూత్ర, తదితర పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 9 లేదా 10వ తేదీల్లో పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పీహెచ్‌సీల్లో కాన్పులు చేయించుకునేందుకు గర్భిణులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఆకుకూరలు, తాజా పండ్లు, కూరగాయలు, గుడ్లు, పాలు రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక మాస పూజలు





శివాలయంలో రాహు కేతు పూజల్లో పాల్గొన్న భక్తులు, కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, చీకూరుపల్లెలో విశేషాలంకారంలో సిద్దేశ్వరస్వామి

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం కార్తీక మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమిళ కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో మొగిలీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ఆవరణలోని బిల్వ చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రదక్షిణ చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మునిరాజులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాహుకేతు పూజలు..

మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉదయం రాహుకాల సమయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ పూజలలో పాల్గొన్నారు.

కార్తీక వన భోజనాలు..

మండలంలోని మొగిలివెంకటగిరి గ్రామంలో సోమవారం తమిళ కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని గంగమ్మ ఆలయం వద్ద కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న ఉసిరి చెట్టుకు మహిళలు పెద్ద ఎత్తున పూజలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. అదేవిధంగా మండలంలోని చీకూరుపల్లె సిద్ధేశ్వర కొండపై కొలువైన శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, జరజాల జగన్ మోహన్ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం కార్తీక వనభోన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.